క్లుప్తంగా

సీతారాములకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సీతారాములు

పాకాల : దామలచెరువులోని సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామలక్ష్మణులకు ఆహారంగా ఆంజనేయస్వామి మామిడి పండ్లు అందించిన దివ్య క్షేత్రంగా ఈ ఆలయానికి పేరు. సూర్య జయంతి రోజున ఈ ఆలయంలో శ్రీరాముల వారి గర్భాలయంలోకి ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడు కిరణాలు ప్రవేశించాయి. రథసప్తమి పర్వదినాన స్వామి అమ్మవార్లకు, అలాగే ఆంజనేయ స్వామికి ప్రయాగ రాజ్‌లోని త్రివేణి సంగమం నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. అలాగే క్షీరం, పెరుగు, కొబ్బరినీరు, చందనం, పంచామృతాలతో ప్రోక్షణ చేపట్టారు. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో రెడ్డెప్పరెడ్డి, రఘునాథ నాయుడు, చక్రపాణి, సురేంద్ర, ప్రసాద్ పాల్గొన్నారు.

చాముండేశ్వరికి ప్రత్యేక పూజలు


విశేషాలంకరణలో అమ్మవారు

తిరుపతి రూరల్ : చంద్రగిరి రోడ్డు ఎల్ఎస్ నగర్‌లోని శ్రీ శక్తి చాముండేశ్వరీ దేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథసప్తమిని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన టాస్క్‌ఫోర్స్ ఎస్పీ


డీజీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ

తిరుపతి మంగళం : డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను మంగళవారం ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) ఎస్పీ పి.శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పనితీరును డీజీపీకి వివరించారు. కూంబింగ్ వివరాలు, సాంకేతికంగా చేపట్టిన చర్యలను తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా నివారణకు మరింతగా కృషి చేయాలని డీజీపీ సూచించినట్లు ఎస్పీ వెల్లడించారు.

శృతికి డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని ఎస్.శృతి డాక్టరేట్ పొందారు. ప్రొఫెసర్ బి.అనురాధ పర్యవేక్షణలో ఆమె 'యాన్ ఎఫిషియంట్ అప్రోచ్ ఫర్ ఐడెంటిఫికేషన్ ఆఫ్ ఫైర్ యూజింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్' అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

'బీపీఎస్'కు మరో అవకాశం

తిరుపతి తుడా : బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్)కు దరఖాస్తు చేసుకుని సరైన పత్రాలను సమర్పించకుండా పెండింగ్‌లో ఉన్న వాటిని సరిచేసుకునేందుకు మార్చి 31వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ అనుమతి లేని, ప్లానుకు విరుద్ధంగా నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణ కోసం బీపీఎస్ స్కీమ్ ను ప్రవేశపెట్టారన్నారు. అలాగే లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్–2020 దరఖాస్తుదారులకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించిందని వెల్లడించారు. భవనాలు క్రమబద్ధీకరించుకుంటే ప్రత్యేకంగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందవలసిన అవసరం లేదని, భవిష్యత్‌లో భవన నిర్మాణ ఫీజులో కూడా మినహాయింపు ఉంటుందని వివరించారు.

అబాకస్‌లో 'ఆర్‌కే' విద్యార్థుల ప్రతిభ


చిన్నారులను అభినందిస్తున్న రామకృష్ణారెడ్డి

తిరుపతి కల్చరల్ : విశ్వం ఎడ్యుకేషనల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరచి అవార్డులు కైవసం చేసుకున్నారని ఆర్‌కే సంస్థ చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వేలాదిమంది పిల్లలు హాజరైన పోటీల్లో తమ విద్యార్థులు రాసమల్లి డోలాషిత ప్రథమ బహుమతి, తేజేశ్వర, దీక్షిత్, లతిక ద్వితీయ బహుమతి పొందారని వివరించారు. ఈ మేరకు అవార్డులు సాధించిన చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌కే విమల, డోలాషిత తల్లిదండ్రులు పృథ్వీ, ఉమామహేశ్వరి, అన్నమయ్య జిల్లా బీసీ ప్రధాన కార్యదర్శి అనగాని రెడ్డప్ప, నరసింహ శాస్త్రి పాల్గొన్నారు.

వెటర్నరీ వైద్యులు.. ఆకలి కేకలు


సమ్మె చేస్తున్న విద్యార్థులతో చర్చిస్తున్న వీసీ రమణ

పాడి రైతులకు వెన్నుదన్నుగా నిలబడే ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో వైద్య విద్యార్థులు వైద్యులు రోడ్డెక్కారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెకు దిగారు. గౌరవ వేతనం పెంచాలని కోరుతూ మూడు రోజులుగా ఆందోళన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం తమపై వివక్ష చూపుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలవారీగా కేవలం రూ.7వేలు మాత్రమే స్టయిఫండ్ చెల్లిస్తూ అన్యాయం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. రోజువారీ ఖర్చులకు సైతం సరిపోక పోవడంతో తల్లిదండ్రులు అప్పులు చేసి నగదు పంపుతున్నారని వాపోతున్నారు. యూనవర్సిటీ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని మండిపడుతున్నారు. సర్కారు వెంటనే స్పందించి ప్రతి నెలా రూ.30వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పటి వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు.

- గౌరవ వేతనం కోసం రోడ్డెక్కిన వెటర్నరీ జూడాలు
- వర్సిటీ అధికారుల కంటి తుడుపు మాటలు
- సమ్మె విరమణకు ససేమిరా అంటున్న విద్యార్థులు


నిరవధిక సమ్మెలో పాల్గొని నినదిస్తున్న వెటర్నరీ వైద్య విద్యార్థులు

ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు చెల్లిస్తున్న గౌరవ వేతనాల వివరాలు

	యూజీ	పీజీ
వెటర్నరీ వైద్య విద్యార్థులకు	రూ.7వేలు	రూ. 9వేలు
మిగిలిన విభాగాల వైద్య విద్యార్థులకు (ఎంబీబీఎస్, డెంటల్, హోమియోపతి, ఆయుర్వేదిక్, అల్లోపతి విద్యార్థులకు)	రూ.26వేలు	రూ.50వేలు

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో పశు వైద్య విద్యార్థులు మూడు రోజులుగా నిరవధిక సమ్మెకు దిగారు. వీరికి అండగా గన్నవరం, ప్రొద్దుటూరు, గరివిడి వెటర్నరీ కళాశాలల విద్యార్థులు సైతం సమ్మె చేపట్టారు. వెటర్నరీ జూడాలు ప్రధానంగా తమకు ప్రస్తుతం అందుతున్న రూ.7వేల గౌరవ వేతనాన్ని రూ.30వేల వరకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఎంబీబీఎస్, అల్లోపతి, హోమియోపతి, దంత, ఆయుర్వేదిక్ విభాగాల జూడాలకు ప్రతి నెలా రూ. 26వేలకు పైగా గౌరవ వేతనం చెల్లిస్తున్నారని, తమకు మాత్రం 12ఏళ్లుగా కేవలం రూ. 7వేలే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులు, వర్సిటీ అధికారుల దృష్టి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండాపోయిందని మండిపడుతున్నారు. స్టయిఫండ్ సరిపోకపోవడంతో ఇంటి నుంచి తల్లిదండ్రులు పంపించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఫలించని చర్చలు

వెటర్నరీ జూడాలతో మంగళవారం వర్సిటీ వీసీ రమణ, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, రిజిస్ట్రార్ శ్రీలత, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ శోభామణి చర్చించారు. మరో నెల సమయం ఇస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అయితే వర్సిటీ అధికారుల కంటితుడుపు మాటలను నమ్మే ప్రసక్తే లేదని జూడాలు స్పష్టం చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె విరమించమని తేల్చి చెప్పేశారు.

పక్షపాతం సరికాదు



ఎంబీబీఎస్ ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు నెలకు రూ. 26వేలు చెల్లిస్తూ, వర్క్ ప్రాంతంలో టీఏ, డీఏతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. పాడి రైతుల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న పశువైద్యులకు మాత్రం నెలకు కేవలం రూ.7వేలు మాత్రమే స్టయిఫండ్ చెల్లించడం దారుణం. మా విషయంలో పక్షపాతంగా వ్యవహరించడం సరికాదు. వెంటనే వారితో సమానంగా గౌరవ వేతనం చెల్లించాలి
– ఎంవీఎస్ ప్రత్యూష, వెటర్నరీ వైద్య విద్యార్థి

స్టయిఫండ్ పెంచాలి



పశు వైద్య విద్యార్థులతో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరం. అందరినీ సమానంగా చూడాలి. పశు వైద్యుల సేవలు నిలిపివేస్తే పాడి పరిశ్రమకు పెను ముప్పువాటిల్లే ప్రమాదముంది. అంతటి ప్రాధాన్యతగల వెటర్నరీ వైద్యుల గౌరవ వేతనం చెల్లింపులో నిర్లక్ష్యం వహించడం తగదు. 6నెలలుగా ఉన్నతాధికారులు, వర్సిటీ అధికారులకు విన్నవించుకున్నా స్పందన కరువైంది. వెంటనే ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి. స్టయిఫండ్ పెంచాలి.
– ఎస్.పూజిత, వెటర్నరీ వైద్య విద్యార్థిని

వేతనం పెంచాలని వినతి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న వెటర్నరీ విద్యార్థులు

రైతు సంక్షేమానికి కృషి చేస్తున్న తమకు గౌరవ వేతనం పెంచాలని ఎస్వీ వెటర్నరీ విద్యార్థులు కోరారు. మంగళవారం ఈ మేరకు స్థానిక పద్మావతి అతిథిగృహంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం అందించారు. విద్యార్థులు మాట్లాడుతూ తమ సమస్యలు, డిమాండ్లు వివరించామని, మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు

అలమటించాల్సిందేనా



అన్నదాతకు అండగా ఉంటూ వారి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న వెటర్నరీ జూడాల పరిస్థితి దారుణంగా ఉంది. మేము అర్ధాకలితో అలమటించాల్సిందేనా. ప్రభుత్వం పట్టించుకోదా... వర్సిటీ అధికారులకు పలు మార్లు గోడు వినిపించినా పట్టించుకున్న పాపాన పోలేదు. మూడు నెలల్లో గౌరవ వేతనం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని గతంలో హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు పట్టించుకోలేదు. డిమాండ్ తీర్చేవరకు సమ్మె కొనసాగిస్తాం – యు.మనోహర్, వెటర్నరీ వైద్య విద్యార్థి

తల్లిదండ్రులకు భారం



జూడాలుగా పనిచేస్తూ ఖర్చుల కోసం ఇప్పటికీ తల్లిదండ్రులకు భారంగా మారడం బాధగా ఉంది. ఇంటర్న్‌షిప్ చేస్తూ ఇంట్లో ఖర్చులకు అడుగుతుంటే చాలా ఇబ్బందికరంగా ఉంటోంది. ప్రభుత్వం మా విషయంలో ఎందుకు ఇలా వ్యవహరిస్తోందో అర్థం కావడంలేదు. పశువులకు ప్రాణం పోస్తున్న వైద్యులను చిన్న చూపు చూడటం సరికాదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి నిర్ణయం తీసుకోవాలి. లేకుంటే సమ్మెను ఉధృతం చేస్తాం – ఎం.గుణకౌశిక్, వెటర్నరీ వైద్య విద్యార్థి

తిరుచ్చిపై వెంకన్న విహారం


ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం ఘనంగా రథసప్తమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువనే స్వామివారిని సుప్రభాతంలో మేల్కొలిపి, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన జరిపించారు. అనంతరం ఉదయం 10 గంటలకు బంగారు తిరుచ్చిపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారు మాడ వీధుల్లో విహరించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో


అశ్వవాహనంపై ఎల్లమ్మ తల్లి

చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో రథసప్తమి వేడుకలు నిర్వహించారు. అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఎల్లమ్మతల్లిని ఏడు అశ్వాలు ఉన్న వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు.

నిర్వహణ లోపిస్తే చర్యలు

తిరుపతి తుడా : నగరంలోని పార్కుల నిర్వహణ లోపం కనిపిస్తే సంబంధిత కాంట్రాక్టర్, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తుడా ఉపాధ్యక్షులు, కమిషనర్ మౌర్య హెచ్చరించారు. మంగళవారం బైరాగిపట్టెడలోని బాబు జగజ్జీవన్ రామ్ పార్కు, శ్రీనివాస్ పార్కు, కపిలతీర్థం ఎన్‌జీఓ కాలనీలోని పార్కును పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ పార్కులను పరిశుభ్రంగా ఉంచాలని, దెబ్బతిన్న ఆట పరికరాలకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు.

అవగాహనతో క్యాన్సర్ నివారణ



చంద్రగిరి : అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


మాట్లాడుతున్న డాక్టర్ హైమావతి

తిరుపతి కల్చరల్ : క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకుంటే నివారణ సాధ్యమే అని మెడికల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రశాంత్ తెలిపారు. మంగళవారం రాస్ కార్యాలయంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ 11 నుంచి 30 ఏళ్ల లోపు వారందరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స తీసుకుంటే మహమ్మారి నుంచి విముక్తి పొందవచ్చని సూచించారు. అనంతరం ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీసంధ్య మాట్లాడుతూ వివిధ రకాల క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. టాటా ట్రస్ట్ ప్రతినిధి హేమంత్ పాల్గొన్నారు.

చంద్రగిరి : స్థానిక గ్రామీణ వైద్య ఆరోగ్య క్రేంద్రంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ ఆరోగ్య కరమైన అలవాట్లు, జీవనశైలిలో మార్పులు, రెగ్యులర్ చెకప్‌లు, ముందస్తుగా గుర్తించడం, చికిత్సపై అవగాహన కల్పించారు. డాక్టర్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన బరువును ఉంచుకోవడం, పొగాకుకు దూరంగా ఉండడం, ఆల్కాహాల్‌ను పరిమితం చేయడం, చర్మాన్ని రక్షించుకుంటే క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రేవతి, డాక్టర్ సౌమ్య ప్రియ, హెల్త్ ఎడ్యుకేటర్ ఎం.టాటాబాయి, రుయా నర్సింగ్ కాలేజ్ ట్యూటర్ చిట్టెమ్మ, స్టాఫ్ నర్సు దేవిక, సూపర్‌వైజర్ నారాయణరాజు పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ : మండలంలోని కొప్పెరవాండ్లపల్లెలో క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. పద్మావతి మహిళా వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.హైమావతి మాట్లాడుతూ రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకా అందుబాటులో ఉందన్నారు. ఈ టీకాను 9 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు బాలికలకు ఇప్పించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం సిబ్బంది డాక్టర్ ఎం.ఇంద్రాణి, ప్రీతి పాల్గొన్నారు.

పాకాల : మండలంలోని దామలచెరువు పీహెచ్‌సీలో క్యాన్సర్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవిరామ్, డాక్టర్ వెంకయ్యబాబు, రెడ్డికుమార్, అమరావతి, మహేంద్ర పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన


ప్రదర్శనలో పుస్తకాలను పరిశీలిస్తున్న నగరవాసులు


వీణ వాయిద్య కచేరీ నిర్వహిస్తున్న శైలజ

తిరుపతి కల్చరల్ : భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో ఇస్కాన్ రోడ్డులోని క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన 17వ పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తోంది. అలాగే ప్రతి రోజు సాయంత్రం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే సుమారు 70 స్టాల్స్ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చిన విశిష్ట గ్రంథాలు, వేలాది పుస్తకాలను పాఠకులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం భారతీయ విద్యాభవన్ సంగీత ఉపాధ్యాయిని శైలజ ప్రదర్శించిన వీణా వాయిద్య కచేరీ అలరించింది. భరత్ శర్మ మృదంగంపై, ప్రసాద్ ఘటంపై సహకారం అందించి రక్తి కట్టించారు. కార్యక్రమంలో విద్యాభవన్ సంచాలకుడు డాక్టర్ ఎస్.సత్యనారాయణరాజు, భవన్ కేంద్ర కమిటీ సభ్యుడు యుగంధర్ రాజు, అసోసియేట్ కార్యదర్శి డాక్టర్ సింగరాజు దక్షిణమూర్తి శర్మ పాల్గొన్నారు.

ప్రజాధనంతో 'పచ్చ'పూత!



చంద్రగిరి నియోజకవర్గంలో 'పచ్చ' నేతల పైత్యం తారస్థాయికి చేరుకుంది. ప్రభుత్వ ఆస్తులపై పసుపు రంగు పడుతోంది. గతంలో తుడా చైర్మన్‌గా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉన్నప్పుడు ప్రజల సౌకర్యార్థం పలు ప్రాంతాల్లో బెంచీలు ఏర్పాటు చేశారు. తాజాగా వీటిపై టీడీపీ నేతల కన్ను పడింది. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన బెంచీలకు పసుపు రంగు వేయిస్తున్నారు. ఈ మేరకు తుడా నుంచి రూ.7.5లక్షలకు కాంట్రాక్టు సైతం తీసేసుకున్నారు. గతంలో హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను బేఖాతర్ చేసేస్తున్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించండి అంటూ ప్రసంగాలు గుప్పిస్తున్న ఎమ్మెల్యే నానికి ఈ విషయాలు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ధనంతో 'పచ్చ' పూత ఏంటని మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే అమాసవారిపల్లెలో బెంచీలకు పెయింట్ వేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో సదరు కాంట్రాక్టర్ నెమ్మదిగా అక్కడ నుంచి జారుకున్నారు.
– చంద్రగిరి

రెచ్చిపోయిన కూటమి నేతలు

– చేతులెత్తేసిన పోలీసులు



పోలీసులను బెదిరిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి తుడా/తిరుపతి సిటీ : డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు రక్షణ కల్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం ఈ మేరకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే కూటమి నేతలు రెచ్చిపోవడంతో చివరకు పోలీసులు చేతులెత్తేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆయన తనయుడు అరణి మదన్ పదుల సంఖ్యలో వాహనాలతో భారీ కాన్వాయ్‌గా ఎస్వీయూ ప్రాంగణంలోకి వచ్చారు. 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నప్పటికీ టీడీపీ, జనసేన నేతలు పెద్దసంఖ్యలో హల్‌చల్ చేశారు. ఈ క్రమంలోనే శాప్ చైర్మన్ రవినాయుడు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఎంట్రీ పాస్ లేని వారికి అనుమతి లేదని పోలీసులు చెప్పినప్పటికీ వినకుండా దౌర్జన్యానికి దిగారు. ''నేనెవరో తెలుసా.. నన్నే అడ్డుకుంటారా.. మీ అంతు చూస్తా'' అంటూ బెదిరింపులకు దిగారు. దీంతో రవినాయుడుని అడ్డుకోలేక పోలీసులు చూస్తూ ఉండిపోవడం గమనార్హం.

సూర్యతేజం..'సప్త' వైభవం

- ఘనంగా రథసప్తమి వేడుకలు
- ఏడు వాహనాలపై విహరించిన దేవదేవేరులు
- సూర్యనారాయణుని సేవకు పోటెత్తిన భక్తులు



సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై విహరిస్తున్న గోవిందరాజస్వామి

తిరుపతి కల్చరల్ : నగరంలో రథ సప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో దేవదేవేరులు సప్తవాహనాలపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ క్రమంలో వేకువజామున 3 గంటలకు శ్రీచక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలోని ఆళ్వారు తీర్థానికి వేంచేపు చేశారు. శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. అనంతరం 5.30 గంటలకు సూర్యప్రభ వాహన సేవకు శ్రీకారం చుట్టారు. అనంతరం హంస, హనుమంత, పెద్దశేష, ముత్యపు పందిరి, సర్వభూపాల వాహనాలను అధిరోహించి స్వామివారు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. కాగా రాత్రి 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు విశేషమైన గరుడ వాహనంపై స్వామి వారు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు చిరంజీవి, శేషగిరి,టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.

కోదండరామాలయంలో..

శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో రథసప్తమిని పురస్కరించుకుని సూర్యప్రభవాహనంపై స్వామివారు ఊరేగారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభ వాహనంపై విహరించారు. డిప్యూటీ ఈఓ నాగరత్న, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.


అశ్వవాహనంపై ఊరేగుతున్న సూర్యనారాయణ స్వామి.

వెండి యజ్ఞోపవీతం సమర్పణ

సూర్యనారాయణ స్వామికి తిరుపతికి చెందిన జయరాఘవులు 400 గ్రాముల వెండి యజ్ఞోపవీతం సమర్పించారు. ఈ మేరకు ఏఈఓ దేవరాజులు, ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, శ్రీహరికి అందజేశారు.


వెండి యజ్ఞోపవీతం అందిస్తున్న దాతలు

తిరుచానూరులో..

తిరుపతి రూరల్ : తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీసూర్య నారాయణ స్వామి వారి గుడికి భక్తులు పోటెత్తారు. రథసప్తమి సందర్భంగా వేకువజాము 2 నుంచి 4.30 గంటల వరకు మూలమూర్తికి అభిషేకం నిర్వహించారు. కోలాటాలు, చెక్క భజనలు, చిడతల భజన, మంగళవాయిద్యాల నడుమ స్వామివారు అశ్వవాహనంపై ఊరేగారు. డిప్యూటీ ఈఓ గోవింద రాజన్, ఏఈఓ దేవరాజులు, అమ్మవారి ఆలయ సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.